



# కల చెదిరింది

- సింగరాజు రామచంద్రమూర్తి

మా పెరట్లో ఉన్న వేపచెట్టు హఠాత్తుగా చెప్పా చెయ్యకుండా మామిడి పళ్ళు కాసిం దనుకోండి! మా ఇంటి ఆవరణలో బంగారం దొరుకు తుందని మీకు తెలిసిం దనుకోండి! అప్పుడు మీకు ఆశ్చర్యం, ఆనందం వరస క్రమంలో కలుగుతాయి. అదలా ఉంచండి.

మా జానకిరాముడు వింత మనిషి. 'పెసిమిస్ట్' అన్న ఇంగ్లీషు మాటకి తెలుగులో స్థూలంగా అర్థం 'అంతా చెడుకే ఉన్నదనేడు స్వభావం కల వ్యక్తి' అని. అతనికీ వర్ణన సరిగ్గా సరిపోతుంది.

ఎవరయినా వచ్చి ఆడపిల్ల పుట్టిం దని అతనికి చెబితే, "ఖర్మ. అడ్డమయిన వాళ్ళకి కాళ్ళు కడగాలి. అదికూడా డబ్బిస్తే కాని కడిగించుకోరు" అంటాడు. పోనీ, మగ పిల్లవాడు కలిగాడని చెబితే, "విక్షేపంగా ఆడదయితే ఇంత డబ్బు మొహాన పోసి కావలిసిన వాడిని కొనుక్కో వచ్చు. మగ వెధవకి చదువు వస్తుందో రాదో తెలియదు. డిప్పకాయ అయిపోవచ్చు" అంటాడు.

"ఇల్లు కడుతున్నాను, వచ్చి చూసిపో" అంటే అతనికి సమాధానం సిద్ధం గానే ఉంటుంది. "ఎందుకు— దండగ. టాక్సులు కట్టడం, అవి సంపాదించేం దుకు అద్దె కివ్వడం, వాడు అద్దె ఇవ్వక పోవడం, లెమ్మంటే లేవకపోవడం, కోర్టు కెక్కడం. . ."

ఈ ప్రవాహంలో ఇల్లు కడుతున్న వాడు పడి కొట్టుకు పోతాడు.

పెళ్ళి శుభలేఖ వచ్చినప్పుడు అతని ఎదురుగా ఉన్న వాడు చచ్చాడే!

"సుఖంగా ఉన్న ప్రాణాన్ని రొంపి లోకిదించుకుంటున్నాడు వీడెవడో పాపం— ప్రభాకరంట! వాడు నా దగ్గరికి వస్తే ముఖం వాచేట్లు చీవాట్లు వేసి ఉండే వాడిని. అయినా, ఖర్మ— పెళ్ళి చేసుకో బోయే ముందు 'వద్దురా బాబూ, చేసుకోకు' అని నెత్తిన నోరెట్టుకుని అరిచినా విని చావడు."

ఏది తీసుకున్నా ఇదే వరస! అనర్గళంగా సాగిపోతుంది అతని ఉపన్యాసం. అయితే, అతను మొదటి నుంచీ ఇలాగే ఉన్నాడనుకోవడం పొరపాటు. అలా లేదు కూడా! మనందరి లాగానే ఉండేవాడు. ఆ మాట నేను గట్టిగా చెప్పగలను. అలాచెప్పే అధికారం నా కుంది! ఎందువల్ల నంటే, అతను నాకు అన్నగారవుతాడు. వరసకి. మా అమ్మకి వాళ్ళమ్మ పినతల్లి కూతురు.

అందరి లాగానే పెళ్ళి చేసుకున్నాడు. చాలా మంది కన్న చాలా ప్రేమగా చూసు కున్నాడు తన భార్యని. ఆవిడా అలాగే ఉండేది ఈయన పట్ల. అయితే, అంత ప్రేమతో ఉన్న ఆవిడా మా వాడిని విడిచి పైకి వెళ్ళిపోయింది. అంటే, చచ్చి పోయిందన్నమాట! దురదృష్టం ఏమంటే, ఆవిడ జబ్బుని మా వాడి డబ్బు నయం చేయలేకపోయింది. ఆవిడకి కాన్సర్ వచ్చింది. ఆవిడ కుంగి, కృశించి పోవడం అతను చూస్తూండ వలసి వచ్చింది.

ఇద్దరు కొడుకు లున్నారు. ఇద్దరినీ వాళ్ళకి ఓపికున్నంత వరకు చదివించా

అవి అతని పట్టుదల. దానికి కావలసిన పొమ్మూ ఏర్పాట్లు ఏర్పాటు చేసుకున్నాడు కూడా! అయితే, వాళ్ళకి 'ఓపిక' లేక పోయింది. "నాన్న సంపాదించింది చదువు కింద మార్చి మళ్ళీ మనం సంపాదించడం, ఇదంతా చుట్టూ తిరుగుడు వ్యవహారం. మనం వేరుగానే అనుభవిద్దాం" అని వాళ్ళ ఉద్దేశ్యం. ఇద్దరికీ చదువు అబ్బలేదు!

ఒకడు కాలేజీకి పోకుండానే ఆపాడు. రెండవ వాడు కాలేజీలో అడుగు పెట్టగానే ఇక చాలు అనుకున్నాడు.

మా జానకిరామయ్యని ఈ రెండు సంఘటనలూ మార్చివేశాయి. 'డిసిల్యూషన్డ్' అంటారు చూశారా— అలాగా అయిపోయాడు. కలలు కరిగిపోగా, ప్రకృతికి ఎదురు తిరిగి మాట్లాడడం అలవరుచుకున్నాడు.

అతని కొక కూతురు కూడా ఉంది. దాని పేరు వాణి.

తలిదండ్రులలో ఉన్న అందమయిన లక్షణాలు అన్నీ ఏరుకుని పుట్టిన వాళ్ళని అదృష్టవంతు లనవచ్చు. తద్వారా 'బెస్ట్ ఆఫ్ బోత్ వరల్డ్స్' అన్నట్లు ఉన్నంతలో అందమయిన వాళ్ళుగా ఉంటారు.

అయితే, ఆ దురదృష్టం వాణిదో, మా జానకిరాముడిదో తెలియదు కాని, ఆ పిల్ల తలిదండ్రులలోని వికారమయిన లక్షణాలన్నీ పుణికి పుచ్చుకుని పుట్టింది! వాళ్ళ అమ్మకి పళ్ళు కొంచెం ఎత్తుగా ఉండేవి. దీని కవి మరీ ఎత్తుగా వచ్చాయి. మా వాడు నలుపు. అది రంగు ఇంకా ముదురుగా పుట్టింది. . . ఈ విధంగా ఎలా ఉండకూడదో అవన్నీ ఏరుకుంటున్న మాట!

ఫలితం వికారమయిన రూపం. అసలు బాగుండదనే చెప్పాలి!

అయితే, మరొకరు చెప్పకుండానే ఆ పిల్లకి తెలుసు. తను, అందంలో అయిదు మార్కులుకూడా తెచ్చుకో లేనని! అందుకే అది మరీ పిచ్చిలవిడిగా పెరిగింది.

నే నెప్పుడయినా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు, అది పది గంటలకి లేచి బ్రష్ పుచ్చుకుని కనబడేది.

"అదేమిటే, వాణీ, పెళ్ళి కావలసిన పిల్లవి, అప్పు డొక్క సారి అలవాట్లు మార్చుకోవడం కష్టం సుమీ" అని అంటే నవ్వేసేది.

"తెలియనట్లు మాట్లాడకు, బాబాయ్. నన్నెవరూ చేసుకునేది? కళ్ళు పోయిన వాడు తప్ప, అటువంటి వాడిని నేను చేసుకోను కదా! కనక ఫలితం — నాకు జీవితంలో పెళ్ళి కాదు. కాని పెళ్ళి కోసం నా స్వేచ్ఛ ఎందుకు తాకట్టు పెట్టు కోవడం?" అనేది.

మా జానకిరాముడిదీ అదే అభిప్రాయం. "ఇటువంటి పిల్లని చూపించి వాళ్ళ ముఖాల్లో వచ్చే వికార లక్షణాలు నేను చూడలేనురా, అబ్బీ, అందుకే దాని కసలు పెళ్ళి ప్రయత్నాలు కూడా చేయ దలుచుకో లేదు. చదువు అబ్బుతూంది — చదువుకోనీ! ఇంత సంపాదించాను కద. మగ పెద్దవలతో బాటు అదీను. సమానంగా రాస్తాను వాటా!"

"అలాకాదు, నిస్పృహ పడితే ఎలా?" అంటూ మనం ఏమయినా చెప్పేందుకు అవకాశంకూడా లేదు. వాళ్ళిద్దరూ చెవినే వేసుకునే వాళ్ళు కాదు. వాళ్ళ సిద్ధాంతమే రైటని పించేది నాకు చూడగా చూడగా.

అటువంటి స్థితిలో, అటువంటి వాడి దగ్గర నుంచి నాకు వచ్చిన ఉత్తరం నన్ను ఆశ్చర్యంలోను, ఆనందం లోను ముంచిందని చెప్పాలి. అందులో ఇలా ఉంది: "ఒరేయ్, అబ్బి, సృష్టిలో చాలా చిత్రాలు జరుగుతాయి సుమా! అంతా చీకటి కాదు, వెన్నెల రాత్రులూ ఉంటాయి.

మన వాణిని చేసుకుంటా మంటూ ఒకరు వచ్చారు. నీకు మొదట అస లిష్టం లేదు. దాన్ని ఇబ్బంది పెట్టడం దేనికని.

అయితే, కుర్రాడే పట్టు పట్టాడు. చూపిస్తే కాని వల్ల కాదని. వాళ్ళని గురించి విచారించాను. చాలా సాంప్రదాయకమయిన కుటుంబం. వేలెత్తి చూపించే వీలు లేదు. "మారెందుకు నా దగ్గరికి వచ్చినట్లు?" అని కుర్రాణ్ణి గురించి విచారించాను. విప్పు లాంటి వాడని తెలిసింది. అందగాడు, మన వాణితో పోలిస్తే కాదు — నిజంగానే అందమయిన వాడు. ఆస్తిపరుడు. చదువుకున్న వాడు.

నాకు అంతు పట్టలేదు వాళ్ళ విషయం.

అంతకన్న చిత్రం ఏమంటే, దాన్ని చూసి పారిపోలేదు. ఒప్పుకున్నారుకూడా! ఒక్కసారి వచ్చిపో నాకు ఆనందంతో మతి పోతూంది. భగవంతుడు కరుణా సముద్రుడుసుమా."

కాంపుకి వెళ్ళినప్పుడు వాళ్ళింటికి వెళ్ళాను. మా వాడి ముఖంలో ఎన్నెన్ని దీపాలు వెలుగుతున్నాయో చెప్పలేను. ఉత్తరంలో విషయాలే చెప్పాడు వివరంగా. నాకూ ఆశ్చర్యంగానే ఉంది. నిజమే మరి! మతి స్థిమితం ఉన్న వాడెవడూ దాన్ని చేసుకో అన్నదే నా అభిప్రాయంకూడా!

వాణి మాత్రం నిర్లిప్తంగా ఉంది! బహుశః ఇది కలగా కరిగి పోతుందేమో నన్న భయం దానిమనస్సులో ఉన్నట్లుంది.

ముగ్గుల గుమ్మ

చిత్రం— టి. వి. ఎస్. మూర్తి (తెనాలి)



వింతగా దబాయించి మాట్లాడినా, పెళ్ళికి ఇష్టపడని వారెవరు?

నా దురదృష్టం ఏమంటే, ట్రెయినింగ్‌కి వెళ్ళడం వలన వాళ్ళ పెళ్ళికి వెళ్ళలేక పోయాను. హృదయ పూర్వకంగా అభినందిస్తూ, తిరిగి ఇంటికి వెళ్ళేప్పుడు మాత్రం తప్పకుండా వాళ్ళ ఊళ్ళో దిగి స్వయంగా ఆశీర్వదిస్తానని ఉత్తరం రాశాను. అదే విధంగా దిగాను కూడా.

మా అన్నయ్య రాసినదానికి భిన్నంగా ఏదీ లేదక్కడ. కుర్రాడు నిజంగా అందమయిన వాడు, ఆరోగ్యవంతుడు. చదువుకున్నవాడు. అయితే ఆస్తి ఉండడం వల్ల ఉద్యోగం చేయకుండా వ్యవసాయం చేసుకుంటున్నాడు.

ఆ చుట్టుపట్ల చాలా గొప్ప పేరు గల కుటుంబం వాళ్ళది!

అతను మా వాణిని ఎందుకు చేసుకున్నట్లు? అతనినే అడగడం భావ్యం కాదు. మా వాణికికూడా అర్థం అయినట్లు లేదు. అదింకా ఈ కల కరిగి పోతుందేమోనన్న భయంతోనే ఉన్నట్లుగా ఉంది.

ఒక పూట భోజనం చేసి వచ్చేశాను. వస్తుంటే నాకు బట్టలు పెట్టారు కూడా వియ్యాల వారు.

అయితే, ఆ ప్రశ్న చిక్కు ప్రశ్నగానే ఉండిపోయింది నా మనస్సులో. కదా మరి? అపురూప సౌందర్యవతులని చేసుకోదగ్గ కుర్రవాడతను.

ఒక రోజు మా ఫ్రెండు రాజుకి కంపెనీ కోసం 'బార్' లో కూర్చుని ఉన్నాను. నేను అక్కడి నేవీ పుచ్చుకో నని తెలు సతనికి. నాకు కోక్ తెప్పించాడు.

"ఇప్పుడు నీ కొకతన్ని పరిచయం చేస్తాను. అతను గుంటూరు రోడ్డు మీద ఇండస్ట్రీ ఒకటి పెడుతున్నాడులే, రెండు లక్షలతో. ఇప్పుడిక్కడికి వస్తా నన్నాడు. నీ గురించి అతనికితెలుసు— నేనే చెప్పాను. నీ కతను బంధువట కూడా!" అన్నాడు రాజు. అయిస్ వేసిన గ్లాసులో కోకోకోలా పోసి నా కిచ్చాడు.

రెండు అరచేతులతోను గ్లాసు గట్టిగా పట్టుకున్నాను. నాకా— చల్లదనమంటే చాలా ఇష్టం.

మాటల్లోనే వచ్చేశా డాయన. చాలా ఖరీదయిన మనిషిలా అగుపడ్డాడు.

పరిచయా లయినాక ఆయనే "మనం బంధువుల మండీ, బాబూ. వ్హాట్, రాజా, గురువుగారికి కోక్ ఇచ్చావా!" అన్నాడు విస్మారంగా.

"తాగను లెండి" అని నవ్వి "ఫరవా లేదు. ఎలర్జీ కాదు, నియమమూ కాదు. అలవాటు పడలేదు. అంతే" అన్నాను.

అతను వెంటనే గ్లాసు లోకి పోసుకుని, సోడా కలుపుకుంటున్నాడు. "బంధుత్వం ఎలాగో చెప్పలేదు మీరు" అన్నాను.

"అదేమిటండి? ఐ సీ మీరు రాలేదు కదూ? అప్పుడు. మధు సూదనం నాకు కజినండి."

నా కింకా అంతు పట్టలేదు.

"అదేమిటండీ, బాబూ, మీ వాణి మొగుడండి" అని నవ్వాడు.

అర్థం అయింది. అతని పేరు మరిచి పోయాను!. . . నాకూ నవ్వు వచ్చింది.

"ఏమిటి నవ్వుతా రిద్దరూ? " అడిగాడు రాజు, అర్థంకాక.

"ఏమీ లేదులే. ఆ మారేజి చిత్ర మయినది. మీకు తెలుసు కదండీ, గురువుగారూ?"అనడిగాడు న న్నాయన.

"తెలియదు" అన్నాను.

"గురువుగారు క్షమిస్తే చెబుతాను . . . పిల్ల చాలా అనాకారి. మా వాడు చాలా అందమయిన వాడు. వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిగింది. పెళ్ళిలో ఆశ్చర్యపడని వాళ్ళు, మా వాడి మీద జాలి పడని వాళ్ళు లేరు" అని నవ్వి, "అసలు ఆ అమ్మాయే షాక్‌లో ఉండిపోయింది నమ్మకం లేక" అన్నాడు.

"అవునవును. ఇప్పటికీ వదల్లేదు దాని కా షాక్! అవును కానండి, నా కొక సందేహం. మీ మధుసూదనం మా వాణిని ఎందుకు పెళ్ళి చేసుకున్నట్లు?"

"మీకు తెలియనే తెలియదా?" అన్నా డాయన ఆశ్చర్యంగా.

"తెలియదు, నిజంగానే" అన్నాను.


ఆయన ఒకసారి నవ్వి, మరో గ్లాసు గొంతులో పోసుకుని అన్నాడు: "మా వాడికి జాతకాల పిచ్చి. వాడికీ నచ్చు చూడడం. వాడి భార్య వారితో కాపరం చేయదుటండీ వాడి జాతక రీత్యా!"

"అంటే?"అన్నా నింకా అనుమానం వదలక.

"అంటే, వాడిని చేసుకున్న పిల్ల లేచి పోవడం కాని, వదిలెయ్యడం కాని చేస్తుందట కాని, వాడితో కాపరం చేయదుట. అది వాడికి చెప్పా రెవరో. అనుమానం వచ్చి వాడూ స్వయంగా నేర్చుకుని తన జాతకం చూసుకుంటే వాడికీ అలాగే అనిపించిందట. ఇదంతా రహస్యం అనుకోండి" అని నవ్వాడాయన.

కాసే పాగి ఆయనే అన్నాడు: "అందు వల్ల మీ వాణి లాంటి అనాకారి అయితే లేచిపోయే అవకాశం శూన్యం కదా! ఇకపోతే తన లాంటి దాన్ని చేసుకున్నందుకు జీవితాంతం కృతజ్ఞురాలై ఉంటుంది కదా?"

ఆశ్చర్యం వేసింది నాకు 'క్రూరా లెంత ఆలోచించాడు?' అని.



నృత్య భంగిమ
చిత్రం —పి. రాజేంద్రప్రసాద్ ( పాత గుంటూరు —1 )

మళ్ళీ ఆయనే అన్నాడు: "మాది ఆ చుట్టు పట్ల పేరు మోసిన కుటుంబ ముండి బాబూ! చిన్నలోపంవస్తే బ్రతకడం కష్టం. ఇటు మీదికూడా మంచి నిప్పు లాంటి కుటుంబం. కనక పిల్లకి మంచి బుద్ధులుంటాయి కదా! అ... కావడాన మా వాడిని అంటి పెట్టుకుని ఉంటుంది. వాడే తన అదృష్టంగా భావిస్తుంది. . .

కానీనరండి, బాబూ, ప్రతి వాళ్ళు చూడ డానికి రావడం ఆ అమ్మాయి ఎదటే 'బంగారం లాంటి అబ్బాయిగారిని కొట్టేశా రమ్మాయిగారు' అనడం. మా వాడు నవ్వుతూ వింటూంటాడు. వాడికి కావలిసిందదే కదా! మరి ఆ అమ్మాయి ఏమనుకుంటూందో, పాపం!"

ఏమనుకుంటుందో ఒక్క ఏడాది తిరిగేసరికి తెలిసి పోయింది నాకు.

మా జానకిరాము దన్నయ్య గారింటికి వెళ్ళేసరికి వాణి కనపడింది నాకు, "ఎప్పుడు వచ్చావమ్మా?" అనడిగాను.

"చాలా రోజులయింది, బాబాయ్, నీ కింకా తెలియదా?" అంది.

నేను మాట్లాడేంత లోనే మా అన్నయ్య నన్నవతలికి లాక్కు పోయాడు. "ఖర్మరా, అబ్బీ, నే న్నీకు రాయలేదు— ఏమని రాయను? అతణ్ణి వదిలి వచ్చేసింది" అన్నాడు.

నాకు పూర్తిగా అర్థంకాక "అంటే?" అనడిగాను.

"అంటే ఏముందిరా నాయనా. నీతో కాపరం వద్దు, నా దారిన నే పోతున్నానని ఇంటికి వచ్చేసింది."

ఆశ్చర్యంవేసింది నాకు "ఎందుకుట?" అనడిగాను.

దానికి సమాధానం వాణే చెప్పింది తరవాత. "ఒక్కొక్కర్ని పిలిచి నన్నెదురుగా కూర్చోపెడతారు, బాబాయ్. వాళ్ళేమో నన్నొక బొద్దింక లాగా చూడటం, ఆయన అందాన్ని మెచ్చుకోవడం—ఇదంతా నా ఎదటే! ఆయనేమో నవ్వుతూ కూర్చోవడం.

ఎన్నాళ్ళని భరించను? అక్కడికీ ఓపిక పట్టాను. చివరి కిప్పుడు మరోటి తగలడింది నా ప్రాణానికి. నన్ను అద్దంలో నా ముఖాన్ని చూసుకో నీయరు. ఆయన్నే చూడాలట రోజంతా! అప్పుడు ఫోటో దిగినట్లు నా కడుపులో ఎదుగుతున్న పాపకి ఆయన పోలిక వస్తుందట.

నా ముఖం అద్దంలో చూస్తే నా పోలిక వస్తుందని వాళ్ళ భయమన్న మాట!

భరించలేక వచ్చేశాను. జీవితంలో తిరిగి రానని చెప్పి వచ్చాను. ఇక వెళ్ళను కూడా!"

నాకు జాలేసింది దాని స్థితికి. నిజమే మధుసూదనం మొదట తెలివిగానే ప్రవర్తించి ఉండవచ్చు. కాని, తరవాత ఆడపిల్లకీ ఒక మన సుంటుం దన్న విషయం మరిచిపోయాడు. తెగేదాకా లాగాడు.

'వాళ్ళ కాపరం చక్కబరిచేందుకు అవకాశా లున్నా యేమో ఆలోచించాలి' అనుకున్నాను. ✷